ఎన్‌ఎస్‌ఎస్‌తో సేవాస్ఫూర్తి

- స్వచ్ఛత, పరిశుభ్రతపై అవగాహన ర్యాలీలు
- పిల్లల ఆరోగ్యం, చదువు తదితర అంశాలపై వలంటీర్ల సర్వే
- చురుకుగా పాల్గొంటున్న ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు


గొర్రెడ్డిపేటలో అవగాహన ర్యాలీలో ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు (ఫైల్)

పెద్దపల్లిరూరల్: విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు సమాజసేవ, క్రమశిక్షణతో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందింపజేసేలా కార్యాచరణ చేపట్టేందుకు జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) దోహదపడుతుంది. ఏదైనా ఓ గ్రామాన్ని ఎంపిక చేసుకుని వారంపాటు అక్కడే ఉంటూ ఆ గ్రామస్తుల స్థితిగతులను అంచనా వేస్తూ వారిని చైతన్య పరిచేలా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహిస్తారు. పచ్చదనం పరిశుభ్రత, మొక్కలు నాటి సంరక్షించడంతో కలిగే ప్రయోజనాలపై ప్రజలకు సులువుగా అర్థమయ్యేలా చేయడమే ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల లక్ష్యం. కొన్నిరోజుల క్రితం పెద్దపల్లి మండలం గొర్రెడ్డిపేటలో ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ విద్యార్థులు, హన్మంతునిపేటలో ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీ విద్యార్థులు వారంపాటు ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు నిర్వహించి ప్రజలను చైతన్యపర్చారు.

సామాజిక స్పృహ పెంచేలా..

సమాజంలోని ప్రతీ పౌరుడు కనీస విద్య చదివితే కలిగే ప్రయోజనాలను వివరిస్తూ, బడీడు పిల్లలను బడికి పంపించాలని గతనెలలో నిర్వహించిన శిబిరం ద్వారా తల్లిదండ్రులకు సూచనలిచ్చారు. స్వశక్తి సంఘాల మహిళలు సైతం అక్షర జ్ఞానం నేర్చుకునేందుకు గల అవకాశాలను వివరించారు. పచ్చదనం, పరిశుభ్రత పాటించడంతో ఆరోగ్యంగా ఉంటామని అవగాహన కల్పించారు. నశాముక్త్ భారత్ కార్యక్రమం ద్వారా మత్తు పదార్థాలకు యువత బానిసలుగా మారకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి తల్లిదండ్రులు, గ్రామస్తులకు అవగాహన కల్పించేలా ర్యాలీలు నిర్వహించారు.

మత్తు పదార్థాల జోలికెళ్లొద్దు



మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. ఇప్పటికే ప్రభుత్వం నశాముక్త్ భారత్ కార్యక్రమం చేపట్టింది. మత్తుకు బానిసైతే భవిష్యత్ అంధకారమే. ఈ విషయాలపై అవగాహన ర్యాలీలు నిర్వహించాం.

– సుమేరా, వలంటీర్

అవగాహన కల్పించాం



జాతీయ సేవా పథకం వలంటీర్‌గా వారంరోజుల పాటు క్యాంపునకు వెళ్లడంతో సేవాభావం పెరిగింది. ఆ గ్రామంలో ఉన్న సామాజిక, ఆర్థిక పరిస్థితులను అంచనా వేసి ప్రజలకు మేలు కలిగేలా పలు అంశాలపై అవగాహన కల్పించాం.

– అక్షయ, వాలంటీర్

సామాజిక స్పృహ పెంపు



ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులు వారంపాటు ఎంపిక చేసిన గ్రామంలో ఉండేలా ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు ఏర్పాటు చేశాం. ఈ క్యాంపునకు వెళ్లడంతో విద్యార్థుల్లో సామాజిక స్పృహ పెరుగుతుంది. అక్కడి ప్రజలకు అవగాహన కల్పించడంతో నాయకత్వ లక్షణాలపై అవగాహన వస్తుంది. – నరహరి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి

సంతృప్తినిచ్చింది



ప్రజలకు వారంపాటు అందుబాటులో ఉంటూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో కలిగే ప్రయోజనాలు వివరించాం. ఇంటి ఆవరణలో కూరగాయలు పెంచితే నాణ్యమైన కూరగాయలతో పాటు ఖర్చు ఆదా అవుతుందని అవగాహన కల్పించడం సంతృప్తినిచ్చింది. – నర్మద, వాలంటీర్

క్లుప్తంగా

పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి


పనులు పరిశీలిస్తున్న కమిషనర్ రమేశ్

సుల్తానాబాద్: పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ రమేశ్ కార్మికులను ఆదేశించారు. పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ కార్మికులు చేస్తున్న పనులను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్వచ్ఛ ఆటో ట్రాలీల ద్వారా తడి, పొడి చెత్తను వేరుచేసి అందించాలని, రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. స్వచ్ఛ సుల్తానాబాద్‌కి పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

పరిహారం చెక్కు అందజేత


పరిహారం చెక్కు అందిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో విధులు నిర్వహిస్తూ కాంట్రాక్టు కార్మికుడు శ్రీకాంత్ ఇటీవల మృతి చెందాడు. కాగా అతడి కుటుంబానికి పరిహారంగా అందించాల్సిన రూ.4లక్షల విలువైన చెక్కును కాంట్రాక్టర్ వెల్ఫేర్ అసోసియేషన్, కార్మిక సంఘాల ప్రతినిధులు పరిహారం చెక్కును బుధవారం టీటీఎస్‌లో అందించారు. ఎన్టీపీసీ రామగుండం డీఎం ప్లాంటులో విధులు నిర్వహించిన శ్రీకాంత్ గుండెపోటుతో మృతి చెందాడు. అతడి కుటుంబానికి సంబంధిత కాంట్రాక్టర్ రాజ్‌కుమార్ రూ.7.50లక్షల పరిహారం అందించేందుకు కాంట్రాక్టర్లు, యునైటెడ్ ఫోరం నాయకుల మధ్య ఒప్పందం కుదిరింది. ఒప్పందం ప్రకారం రూ.3.20లక్షల చెక్కును ఇంతకు ముందే అందించగా మిగతా రూ.4లక్షల చెక్కును అందించారు. యూనియన్ నాయకులు నాంసాని శంకర్, చిలుక శంకర్, జమీల్, భూమయ్య, రాజమల్లయ్య, రమేశ్, కాంట్రాక్టర్లు ఏలిని నారాయణ, రాజాకిషన్ రావు, పేరం రమేశ్, మల్లేశం పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి


విన్నర్ జట్టుతో నాయకులు

ఎలిగేడు: యువత క్రీడల్లో రాణించాలని ధూళికట్ట మాజీ సర్పంచ్ బాలుసాని పర్శ రాములుగౌడ్ అన్నారు. మండలంలోని ధూళికట్టలో 15రోజులుగా నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ డీపీఎల్ సీజన్–1లో మొతం 10జట్లు పాల్గొన్నాయి. బుధవారం జరిగిన ఫైనల్‌లో ముప్పిరితోట–ధూళికట్ట జట్లు తలపడగా విన్నర్‌గా ధూళికట్ట, రన్నర్‌గా ముప్పిరితోట జట్లు నిలిచాయి. విన్నర్ జట్టుకు రూ.15వేల నగదు, షీల్డు, రన్నర్ జట్టుకు రూ.8వేల నగదు, షీల్డ్ అందించారు. మాజీ ఉపసర్పంచులు ఆవుల ఐలయ్య, ఆవుల చంద్రయ్య, మాజీ వార్డు సభ్యులు గీస మహేందర్, క్రికెట్ ఆర్గనైజర్లు రంగు శ్యాంగౌడ్, ఆవుల మనోజ్, మిలుకూరి విష్ణు, అంపైర్లు మేర్గు రాజు, మల్లన్న, శ్రీనివాస్, హరీశ్ పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో పూజలు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి సన్నిధిలో బుధవారం భక్తులు పూజలు చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు మల్లన్న దర్శనం కోసం వచ్చారు. దేవస్థానంలోని కోనేరులో స్నానాలు ఆచరించి ప్రదక్షిణలు చేశారు. మల్లికార్జునస్వామి, సీతరామచంద్రస్వామి, నందీశ్వరులను దర్శించుకున్నారు. ఒగ్గు పూజారులతో స్వామివారికి పట్నాలతో పాటు బోనాలు సమర్పించారు. దర్శనం కోసం వచ్చిన భక్తులకు ఆలయ జూనియర్ అసిస్టెంట్ ముద్దసాని కుమారస్వామి ఏర్పాట్లు చేశారు.

గుండెపోటుతో ప్రైవేట్ వైద్యుడు మృతి

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీకి చెందిన ప్రైవేట్ వైద్యుడు(ఆర్‌ఎంపీ) బండారి మల్లయ్య(66) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ ఏరియా ఆసుపత్రిలో 30ఏళ్ల నుంచి కాలనీ ప్రజలకు వైద్యసేవలు అందించారు. కాలనీలోని పలువురు మల్లయ్యకు నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా మల్లయ్య నేత్రాలను కుటుంబ సభ్యులు సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దానం చేశారు. ఐ టెక్నీషియన్ ప్రదీప్ నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐబ్యాంకుకు తరలించారు.

రోడ్డుభద్రతపై ట్రాఫిక్ పోలీసుల అవగాహన


ప్రతిజ్ఞ చేయిస్తున్న ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు

గోదావరిఖని: రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం బుధవారం గోదావరిఖని ట్రాఫిక్ పోలీసులు నిర్వహించారు. స్థానిక మున్సిపల్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుతున్న వారిని పట్టుకున్నారు. వారితో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐ హరిశేఖర్, ట్రాఫిక్ పోలీసులు, ద్విచక్ర వాహన దారులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో గోపూజలు


గోపూజలో పాల్గొన్న భక్తులు

ధర్మారం: మండల కేంద్రంలోని హరిహర సుత అయ్యప్ప ఆలయంలో బుధవారం గో పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి బీవీ నర్సింగరావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు గోశాలలోని గోవులకు మేత కోసం వివిధ రకాల ధాన్యాలను తీసుకవచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు తాటిపెల్లి ఈశ్వర్, బ్రిలియంట్ విద్యా సంస్థల చైర్మన్ సిరిపురం సత్యనారాయణ, వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మంథని: మంథని పూసల సంఘం భవన నిర్మాణానికి రూ.20లక్షలు కేటాయించినందుకు బుధవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో పూసల సంఘం ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు గుంటుపల్లి సమ్మయ్య మాట్లాడుతూ అణగారిన వర్గాలను ఆదుకున్న ఘనత శ్రీధర్‌బాబుకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పూసల సంఘం మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ గుంటుపల్లి సమ్మయ్య, జిల్లా అధ్యక్షుడు పొదిల కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి ముద్రకోల తిరుపతి, ఉపాధ్యక్షుడు పట్టం తిరుపతి, మంథని పూసల సంఘం ప్రధాన కార్యదర్శి కావేటి సమ్మయ్య, కోశాధికారి కావేటి శ్రీనివాస్, కార్యదర్శి చేని రవి, గుంటుపల్లి సతీశ్, కావేటి పెద్ద సమ్మయ్య, కావేటి సారయ్య, కావేటి రాంబాబు, ముద్రకోల రమేశ్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నివారణకు సహకరించాలి

సుల్తానాబాద్: మత్తు పదార్థాల నివారణకు ప్రతీఒక్కరు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రమేశ్ కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మిషన్ పరివర్తన, మహిళా సాధికారత కేంద్రం సంయుక్త అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం మున్సిపల్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. నశాముక్త్ భారత్ కమ్యూనిటీ ఎడ్యుకేటర్ శ్యామల, హబ్ కోఆర్డినేటర్ అరుణ, జనరల్ స్పెషలిస్ట్ సుచరిత, మున్సిపల్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ పాత్రికేయుడికి నివాళి

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీకి చెందిన సీనియర్ పాత్రికేయుడు సురేంద్రపాల్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం యైటింక్లయిన్‌కాలనీ ప్రెస్‌భవన్‌లో పాత్రికేయులు, ప్రెస్‌క్లబ్ సభ్యులు క్లబ్ తరపున అతని ఆత్మశాంతి కోసం మౌనం పాటించారు. అనంతరం నివాళి అర్పించారు. ప్రెస్‌క్లబ్ నిర్వాహకులు రవీందర్, సభ్యులు మహేందర్‌రెడ్డి, నర్సింగరావు, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

బల్దియాలో కొనసాగుతున్న కూల్చివేతలు



కోల్‌సిటీ: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రోడ్ల విస్తరణ, పలు వాణిజ్య భవనాల నిర్మాణాల కోసం కూల్చివేతల పర్వం కొనసాగుతోంది. ఇందులో భాగంగా బుధవారం బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారులు ఆపరేషన్ అశోకా చేపట్టారు. ఓల్డ్ అశోక థియేటర్ ప్రాంతంలోని సింగరేణి క్వార్టర్స్‌ను ఆనుకొని నిర్మించిన వీకే రెడ్డి టీస్టాల్‌తో పాటు పలు దుకాణాలను అధికారులు జేసీబీతో కూల్చివేయించారు. ఈ కూల్చివేతలతో స్థానిక వ్యాపారులు ఆందోళన చెందారు.

సంక్షిప్త వార్తలు

• బాధిత కుటుంబానికి పరామర్శ

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లికి చెందిన గద్దల విమల ఇటీవల అనారోగ్యానికి గురైంది. బుధవారం రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలిఠాకూర్ వారి ఇంటికి వెళ్లి బాధితురాలితో మాట్లాడింది. అండగా ఉంటామని వారి కుటుంబానికి భరోసా ఇచ్చారు. అనంతరం గ్రామంలోని పలువురు మహిళలను కలిసి గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కారానికి చర్యలు చేపడతారని హామీ ఇచ్చారు. ఆమె వెంట కాంగ్రెస్ మండల ప్రతినిధులు ఉన్నారు.

• ఆమె నేత్రాలు సజీవం

కోల్‌సిటీ: గోదావరిఖని తిరుమల్‌నగర్‌కు చెందిన సంఘ అలియాస్ బత్తుల గౌరమ్మ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. కాగా ఆమె అల్లుడు, సదాశయ ఫౌండేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు లగిశెట్టి చంద్రమౌళి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. దీంతో ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులు గౌరమ్మ నేత్రాలను దానం చేశారు. ఎల్వీ ప్రసాద్ ఐటెక్నీషియన్ ప్రదీప్ నాయక్ ఆధ్వర్యంలో సేకరించిన నేత్రాలను హైదరాబాద్‌కు తరలించారు. నేత్రదాత కొడుకు, కోడలు సంఘ సురేశ్, తిరుమల, కూతురు, అల్లుడు లగిశెట్టి లక్ష్మి, చంద్రమౌళి, మనుమడు శ్రీకాంత్, మనుమరాలు నవ్యశ్రీని సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, ప్రచార కార్యదర్శి వాసు, గౌరవ అధ్యక్షులు సానా రామకృష్ణారెడ్డి, ముఖ్య సలహాదారులు రమేశ్ అభినందించారు. కార్యక్రమంలో డి.మల్లేశ్, బోల్ల రమేశ్, సంఘ కొమురయ్య, పనాస రాజేశం, తోటి వెంకటేశ్, మృత్యుంజయం, కుమార్, వాసు, తిరుపతియాదవ్, లక్ష్మణ్‌యాదవ్, నరేశ్, విజయకుమార్‌గౌడ్, దేవేందర్, రాజేశ్, రిచిత్, రాంచంద్రంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

• జిల్లా గ్రంథాలయ ఇన్‌చార్జి సెక్రటరీగా సరిత

పెద్దపల్లిరూరల్: జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జి సెక్రటరీగా బుధవారం సరిత బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్న సరితకు పెద్దపల్లి జిల్లా బాధ్యతలను అదనంగా అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

• సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి గర్హనీయం

రామగుండం: ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయిపై సుప్రీంకోర్టు న్యాయవాది దాడి చేయడం గర్హనీయమని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఈ దాడి భారత రాజ్యాంగం, న్యాయ వ్యవస్థకు ఒక చీకటి రోజుగా అభివర్ణించారు. దేశంలో దళితులకు అత్యున్నత పదవులు దక్కుతున్నప్పటికీ ఆధిపత్య కులాల నుంచి అవమానాలు తప్పడం లేదన్నారు.



ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 22వ డివిజన్ లక్ష్మీపురం గ్రామ శివారులోని ఆర్‌ఎఫ్‌సీఎల్ ఖాళీ స్థలంలో గోదావరిఖని పరిసర ప్రాంతాల వ్యాపార సంస్థల నుంచి సేకరించిన పాత పరుపులు, సోపాలు, పాత టీవీలు, ఫ్రిడ్జ్ వంటి ప్లాస్టిక్ వ్యర్థాలు డంప్ చేసి కాలుస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు కాలడంతో పొగతోపాటు కాలుష్యం వెదజల్లుతోంది. మంటల తీవ్రత అధికంగా ఉండడంతో స్థానికులు ఫిర్యాదు మేరకు ఆర్‌ఎఫ్‌సీఎల్ ఫైర్ సేఫ్టీ అధికారులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చేస్తున్నారు. రామగుండం నగరపాలక సంస్థ అధికారులు స్పందించి ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడి హేయమైన చర్య


నిరసనలో సీపీఐ నాయకులు

పెద్దపల్లిరూరల్: దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి పాల్పడడం హేయమైన చర్య అని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. పెద్దపల్లి బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. సుప్రీం సీజేపై జరిగిన దాడి రాజ్యాంగంపై జరిగిన దాడిగా సదానందం పేర్కొన్నారు. నాయకులు సూర్య, మానస్‌కుమార్, ప్రీతం, నవీన్, అంజి, శంకర్, రవి, ఎల్లయ్య, రామస్వామి, సాయి, ఆజాద్ పాల్గొన్నారు.

పంట వివరాలు నమోదు చేసుకోవాలి


పంట వివరాలు నమోదు చేసుకుంటున్న వ్యవసాయ అధికారి

ధర్మారం: రైతులు సాగుచేసిన పంటల వివరాలను ఆయా వ్యవసాయ విస్తీర్ణాధికారుల వద్ద నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి భాస్కర్ కోరారు. మండలంలోని దొంగతుర్తి, బొమ్మారెడ్డిపల్లి, మేడారం, సాయంపేట, ఖిలావనపర్తి గ్రామాల్లో వర్షాకాలం పంటల వివరాలు నమోదు చేశారు. మండల ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులు ఆన్‌లైన్‌లో పంటల వివరాలు నమోదు చేసుకుంటే మద్దతు ధరలకు ప్రభుత్వం విక్రయాలు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ నెల 20 తేదీలోగా వానాకాలంలో సాగుచేసిన పంటల వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.



డ్రైనేజీ నిర్మించండి సారూ..

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 23వ డివిజన్ ఖాజీపల్లి గ్రామంలో డ్రైనేజీ లేదు. దీంతో మురుగునీరు రోడ్డుపైకి చేరి దుర్గంధం వెదజల్లుతోంది. రోడ్డుపై మురుగునీరు పారడంతో ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. రామగుండం నగర పాలక సంస్థ అధికారులు స్పందించి డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన


ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న సాగర్‌రెడ్డి

ఓదెల: లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి అన్నారు. మండలంలోని నాంసానిపల్లె గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందన్నారు.

కుక్కలను మహదేవపూర్ అడవుల్లో వదిలిపెడతాం


కుక్కలను బంధిస్తున్న నిర్వాహకులు

సుల్తానాబాద్: పట్టణంలో పలు కాలనీల్లో కుక్కలు పట్టుకొని మహదేవపూర్ అడవుల్లో వదిలివేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమేశ్ తెలిపారు. బుధవారం వార్డుల్లో కుక్కలు పట్టేందుకు నిర్వాహకులు రాగా వారితో పట్టించారు. వాటిని మున్సిపల్ సిబ్బంది అడవులలో వదిలి వేయనున్నట్లు తెలిపారు. తర్వాత కోతుల బెడద లేకుండా చేస్తామని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్

పెద్దపల్లిరూరల్: జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో పెద్దపల్లి గాయత్రీ విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు తనీష్, సాయిచరణ్‌రెడ్డి, జశ్వంత్‌రావు సత్తా చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 9, 10వ తేదీల్లో మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున పాల్గొంటారన్నారు. విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంపై విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను కరస్పాండెంట్ రజనీదేవి, ప్రిన్సిపాల్ విజయ్, పీఈటీలు అజయ్, మంజుల అభినందించారు.